
సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 21 । జూలై । 2023



సృజన వెలికితీసేలా బోధన

రేగుపాలెం, పులపర్తి పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. సృజనాత్మకతను వెలికితీసేలా బోధన సాగాలని సూచించారు. 8లో



సహస్ర తులసిపూజ

విశాఖ: కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. శ్రీచక్రా నవవర్ణార్చన లక్ష్మీహోమం ఘనంగా జరిగాయి.



సిరిధాన్యాలతో చిత్రపటం

విశాఖ: సిరిధాన్యాలతో తీర్చిదిద్దిన చిత్రపటాన్ని ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ బహూకరించారు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం

అనకాపల్లి టౌన్: స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొంటారని చెప్పారు. ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో అందుబాటులోకి వైద్యం

- డీఎంహెచ్‌వో హేమంత్



సీతానగరం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

అనకాపల్లి రూరల్: విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు గ్రామాల్లోనే అందుబాటులోకి వచ్చాయని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ హేమంత్ తెలిపారు. మండలంలోని సీతానగరంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. క్లినిక్‌లో ఉన్న ఔషధాల నిల్వలు, వాటి బట్వాడాకు సంబంధించిన రికార్డులు, వైద్య సేవల నిర్వహణ రికార్డులు పరిశీలించారు. ఈ ఆశ యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలపై ఆరా తీశారు. ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్న ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నిక్షిప్తం చేయాలని ఆశాలకు సూచించారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించి, పిల్లల, విద్యార్థుల హెల్త్ చెకప్‌నకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పెడుతున్న పోషకాహార వివరాలను ఆరా తీశారు. పిల్లల్లో రక్తహీనత లేకుండా చూడాలని అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులకు చెప్పారు. కార్యక్రమంలో తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు జి.పావని, హెల్త్ సూపర్‌వైజర్లు శంకర్, సాంబశివరావు పాల్గొన్నారు.

పెరుగుతున్న 'రైవాడ' నీటిమట్టం

- కొనసాగుతున్న 680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 108.60 మీటర్లు



నిండుకుండలా రైవాడ జలాశయం

దేవరాపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు రైవాడ జలాశయం నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 680 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం గరిష్ట నీటి మట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 108.60 మీటర్లకు చేరుకుంది. జలాశయం నీటిమట్టం పెరుగుతుండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నారుమడులు ఏపుగా ఎదుగుతుండటంతో దమ్ములు చేసేందుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ పంటలకు సాగునీటికి ఢోకా ఉండబోదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఒకట్రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జలాశయంలోకి మరింత వరద నీరు వచ్చి చేరుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

24 నుంచి ఐఐపీఈ 'హీరో' సదస్సు

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు హైడ్రోజన్ శక్తి వనరులు, అవకాశాలు (హీరో)-2023పై సదస్సు జరగనుంది. నోవాటెల్ హోటల్‌లో జరిగే ఈ సదస్సుకు భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయు మంత్రిత్వ శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి, ఏపీ ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి కె.విజయానంద్, యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా ఆచార్యుడు జి.కె సూర్య ప్రకాష్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ ప్రసిద్ధి గాంచిన సంస్థల నిపుణులు, విద్యావేత్తలు, చమురు ఇంధన రంగానికి చెందిన పరిశ్రమల నిపుణులు, భారత ప్రభుత్వ అధికారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి పంట కాలువలు



ఉపాధి హామీ పథకంలో పంట కాలువలో పూడిక తీత పనులు (ఇన్‌సెట్) ఉద్యానపంటల్లో మొక్కలకు కుంటలు చేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి హామీ పథకంతో పంట కాలువల దశ తిరిగింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో పంట కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపడుతున్నారు. దీన్ని ఉపాధి పథకానికి అనుసంధానించారు. దీంతో గ్రామాల్లో జాబ్‌కార్డుదారులకు ఉపాధితో కల్పన, పంట కాలువల పునరుద్ధరణ ఏకకాలంలో జరుగుతోంది.

- ఖరీఫ్ ప్రారంభం కానుండటంతో పంట కాలువల్లో పూడికతీత
- ఇప్పటి వరకు 659 వ్యవసాయ కాలువల్లో పూడిక తొలగింపు
- జిల్లాలో 10 వేల ఎకరాల్లో ఉద్యాన తోటలకు పంట కుంటలు

సాక్షి, అనకాపల్లి: ఉపాధి పనులు జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతున్నాయి. ఏడాది కాలంగా పిచ్చి మొక్కలతో, పూడికలతో నిండివున్న పంట కాలువలకు, గట్లకు మోక్షం కలుగుతోంది. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతులు పంట కాలువ పనులను, గట్లను సొంత డబ్బులు వెచ్చించి పనులు చేపడతారు. ఇపుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కాలువల పనులు, గట్లు, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కల తొలగింపు తదితర పనులను కూడా ఉపాధి పథకంలో చేపట్టేందుకు శ్రీకారం చుట్టాయి. వీటికోసం ప్రత్యేకంగా నిధులను కూడా మంజూరు చేశాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రైతుల విన్నపం మేరకు ఉపాధి పనులు జరుగుతున్నాయి.

అమృత్ సరోవర్‌తో జల కళ

ఇప్పటికే అమృత్ సరోవర్ పథకంలో చెరువులు, కాలువల తవ్వకం పనులు చేపట్టారు. జిల్లాలో 75 ప్రధాన చెరువుల్ని ఈ కార్యక్రమంలో ఎంపిక చేసి ఆగస్టు నాటికి పూర్తి చేయాలని లక్ష్య నిర్దేశనం చేశారు. అయితే అధికారుల ప్రత్యేక చొరవ, జాబ్‌కార్డుదారులకు ఎక్కువ పనిదినాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేయడంతో 105 చెరువుల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. అనంతరం కాలువలను కూడా ఖరీఫ్ సీజన్ వర్షాలకు ముందే పూడిక తొలగించి, సాగునీటి ప్రవాహానికి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే 659 పంట కాలువల్లో పూడిక తీత పనులు పూర్తి చేశారు. మిగిలిన కాలువల్లో కూడా త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కోటీ 14 లక్షల పని దినాలు లక్ష్యం

వేసవిలో సాధ్యమైనంత మేరకు జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పని కల్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగం చొరవ చూపింది. గ్రామ స్థాయిలో అవసరమైన ప్రతి పనినీ ఉపాధి పథకంలో చేర్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. వ్యవసాయాధార గ్రామాల్లో చెరువులు, కాలువలు, రోడ్లు, గట్లు ఇలా ప్రతి దానినీ అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించారు. అందుకే 2023-24లో ఉపాధి హామీ పథకంలో భాగంగా కోటీ 14 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 91 లక్షల పనిదినాలు కల్పించారు. వీటిలో పంట కాలువల్లో పూడిక తొలగింపు, ఉద్యాన పంటల్లో కుంటలు తవ్వకం పనులే 3.74 లక్షల పనిదినాలు.

జిల్లాలో వివరాలు

- 24 మండలాల్లో ఉపాధి పనులకు రూ.27.17 కోట్లు మంజూరు
- వీటిలో ఇప్పటి వరకు ఖర్చు చేసింది రూ.9.50 కోట్లు
- ఇప్పటి వరకు జరిగిన ఉపాధి పని దినాలు 91 లక్షలు
- కాలువల్లో పూడిక తీత, కుంటలు తవ్వేందుకు 3.74 లక్షల పనిదినాలు
- జిల్లాలో జాబ్‌కార్డులు 2,39,421, వేతనదారులు 1,47,210 మంది

రైతులకు మేలు కలిగేలా..



ఈ ఏడాది ఉపాధి హామీ పనులు కోటీ 14 లక్షలుగా నిర్దేశించాం. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేటి వరకూ 91 లక్షల పనిదినాలు కల్పించాం. వీటిలో పంట కుంటలు, కాలువల పూడికతీతలో 3.74 లక్షల పనిదినాలు పూర్తి చేశాం. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో రైతుల విన్నపం మేరకు పంట కాలువ, ఉద్యానవన కుంటలపై ఉపాధి పనులు జరుగుతున్నాయి.

– సందీప్, డ్వామా పీడీ

జగనన్న సురక్ష సూపర్ సక్సెస్



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

- ప్రతి ఇంటికీ చేరువైన ప్రభుత్వ సేవలు
- జిల్లాలో నేటికి 366 శిబిరాలు పూర్తి
- 1,96,794 అభ్యర్థనలకు ఆమోదం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

సాక్షి, అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం అపూర్వ రీతిలో ప్రజలకు ప్రభుత్వ సర్వీసులను అందించి రికార్డు సృష్టించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. గురువారం అనకాపల్లి రింగ్ రోడ్డు సమీపంలో గల పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించే ఇలాంటి కార్యక్రమాలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గొప్ప చరిత్ర సృష్టించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందకుండా ఉండరాదన్న మహోన్నత లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. జగనన్న సురక్ష ప్రారంభమైన ఈనెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 366 శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 3,74,781 ఇళ్లను ఈ కార్యక్రమంలో సర్వే చేశారని తెలిపారు. ఇందులో సేవల కోసం మొత్తం 2,16,976 అభ్యర్థనలు నమోదు కాగా.. వాటిలో 1,96,794 ఆమోదం పొందాయన్నారు. ఈనెల 18న ఒకే రోజులో రాష్ట్రవ్యాప్తంగా 6,87,863 సర్టిఫికెట్లు జారీ చేసి రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త రికార్డు సృష్టించిందని బొడ్డేడ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ భారీ విజయాన్ని సాధించిన ఘనత ప్రతి గ్రామ వలంటీర్‌కు చెందుతుందని, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వారు అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు.

పవన్‌పై చర్యలకు జీవో

గ్రామ/వార్డు వలంటీర్లను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినందుకు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం జీవో 16 జారీ చేసిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీటీసీ సభ్యులు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్ ఎ.వి.రత్నకుమారి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, మాజీ కౌన్సిలర్ దాడి భోగలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారతీయం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి రజని, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, మేయర్ హరి వెంకటకుమారి

మహారాణిపేట (విశాఖ): కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకుని యాక్మీ స్వచ్ఛంద సంస్థ 'భారతీయం' పేరిట ఈ నెల 26న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కలెక్టర్ చాంబర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో 'భారతీయం'పోస్టర్‌ను టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఆవిష్కరించారు. కార్గిల్ అమరవీరుల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, యాక్మీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యాక్మీ ప్రతాప్, కార్యదర్శి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరకోటి విద్యుత్ చౌర్యం..!

- గుర్తించి నోటీసులు జారీ చేసిన ఈపీడీసీఎల్

సాక్షి, విశాఖపట్నం : వెయ్యి కాదు.. పది వేలు కాదు.. ఏకంగా అరకోటి విలువైన విద్యుత్‌ని అక్రమంగా వినియోగించుకుంది ఓ సంస్థ. ఆలస్యంగా గుర్తించిన ఈపీడీసీఎల్ అధికారులు సదరు సంస్థకు నోటీసులు జారీ చేశారు. వరాహ లక్ష్మీనరసింహస్వామి ఎడ్యుకేషనల్ ట్రస్ట్.. దరఖాస్తు మేరకు 2020 జూన్ 20న 11కేవీ సామర్థ్యం ఉన్న కనెక్షన్‌ని ఈపీడీసీఎల్ కేటాయించింది. బిల్లులు సకాలంలో చెల్లించని కారణంగా 2022 సెప్టెంబర్ 3న నోటీసులు ఇచ్చారు. మొత్తం రూ.6,68,386 చెల్లించని కారణంగా కనెక్షన్ నిలుపుదల చేశారు. అయినా బిల్లు చెల్లించకపోవడంతో 2023 జనవరి 7న ట్రస్టుతో అగ్రిమెంట్‌ని ఈపీడీసీఎల్ టెర్మినేట్ చేసింది. బకాయిలతో కలిసి మొత్తం రూ.10.26 లక్షలు చెల్లిస్తేనే కనెక్షన్ పునరుద్ధరిస్తామని మరోసారి నోటీసులు జారీ చేసింది. దీంతో ఆ సంస్థ రూ.9.47 లక్షలు ఈ ఏడాది ఏప్రిల్‌లో చెల్లించి కనెక్షన్ పునరుద్ధరించాలని ఈపీడీసీఎల్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో కనెక్షన్ ఇచ్చేందుకు సిద్ధమైన ఈపీడీసీఎల్ అధికారులకు దిమ్మతిరిగే షాక్ తగిలింది. కనెక్షన్ తొలగించినా.. సదరు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మాత్రం అనధికారికంగా విద్యుత్‌ని వినియోగించుకున్నట్లు గుర్తించారు. 2022 సెప్టెంబర్ నుంచి ఏకంగా 1,82,428 యూనిట్లు వినియోగించినట్లు తేల్చారు. ఈ యూనిట్ల విద్యుత్ విలువ రూ.53,42,489గా గణించారు. దీనిపై స్పందించిన ఈపీడీసీఎల్ అధికారులు సదరు లక్ష్మీనరసింహ స్వామి ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కు విద్యుత్ చౌర్యం నోటీసులతో పాటు ప్రొవిజినల్ ఎసెస్‌మెంట్ నోటీసులు కూడా జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

సిబ్బంది ప్రమేయముందా..?

సాధారణంగా ఒక ఇంటికి సంబంధించిన కనెక్షన్ తొలగిస్తే.. కనెక్షన్ పునరుద్ధరించాలంటే దరఖాస్తు పెట్టుకోవాలి. సంబంధిత ఇంజినీర్, లైన్‌మెన్ సమక్షంలో విద్యుత్ సరఫరా అందిస్తారు. కానీ 11కేవీ విద్యుత్ సరఫరా కట్ చేసినా.. సరఫరా పునరుద్ధరించుకోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానిక ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది సహకారం లేకుండా సరఫరా సాధ్యం కాదనేది స్పష్టమవుతోంది. స్థానిక లైన్‌మెన్ లేదా, ఇతర సిబ్బంది ఎవరైనా సహకరించారా అనే కోణంలోనూ ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. అయితే.. వీరిని తప్పించేందుకే విద్యుత్ చౌర్యం సదరు సంస్థే సొంతంగా చేసుకుందనే రీతిలో ఇంజినీరింగ్ విభాగంలో ఉన్న ఒక ఉన్నతాధికారి కొమ్ముకాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

వైఎస్సార్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట (విశాఖ): వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలు, వైఎస్సార్ సాఫల్య పురస్కారాలు-2023 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విస్ సీఈవో సీహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. కళలు, సామాజిక సేవ, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, వైద్యం, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీస్, స్పోర్ట్స్, రాజకీయం, ఎన్జీవోలు, లాభాపేక్ష లేని సంస్థలు/సంఘాలు తాము అందిస్తున్న సేవలను వివరిస్తూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓ పేజీలో పూర్తి వివరాలు వెల్లడించి.. ప్రెస్ క్లిప్పింగ్‌లు, ఫొటోలు జతచేసి, చిరునామా, ఫోన్ నంబర్, ఈ మెయిల్‌ను ఆగస్టు 12లోగా జిల్లా యువజన సంక్షేమ అధికారి/ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేట, విశాఖపట్నంలో సమర్పించాలి.

కోల్ ఇండియా చైర్మన్‌తో స్టీల్‌ప్లాంట్ సీఎండీ భేటీ

ఉక్కునగరం: కోల్ ఇండియా చైర్మన్ పి.ఎం.ప్రసాద్‌ను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ గురువారం కలిశారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతితో కలిసి ఆయన కోల్ ఇండియా ప్రధాన కార్యాలయంలో చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా కోల్ ఇండియా, స్టీల్‌ప్లాంట్ మధ్య సంబంధాల బలోపేతం గురించి చర్చించారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తికి అంతరాయం కలగకుండా అవసరమైన కోకింగ్ కోల్, థర్మల్ కోల్ సరఫరా చేయాలన్నారు.

నేటి నుంచి ఇంటింటా ఓటర్ సర్వే



ఓటర్ల నమోదుపై రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- సర్వే నిర్వహించే బీఎల్వోలకు సహకరించండి
- రాజకీయ పార్టీల సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు 32 రోజుల పాటు బీఎల్వోల ద్వారా ఇంటింటి ఓటరు సర్వే నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై సర్వే చేస్తారని తెలిపారు. ఎన్నికల నామినేషన్లకు 10 రోజుల ముందు వరకు ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 18 ఏళ్లు నిండి వారు ఓటరుగా నమోదయ్యేలా రాజకీయ పార్టీలు అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు.

ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓటున్నా, సర్వేలో పొరపాట్లను గుర్తించిన వెంటనే తమకు తెలియజేయాలన్నారు. జాబితాలో ఓటరు పేరు, పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకునేందుకు ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్, voters.eci.gov.in వెబ్‌సైట్‌లో తనిఖీ చేసుకోవచ్చన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వచ్చే బీఎల్వోలకు ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఓటరు సర్వే చేసినట్లు ఇంటికి మార్కు చేయాలని, మద్యం తాగి వచ్చే వారికి ఓటు వేసే అవకాశం కల్పించకూడదని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు కోరారు. సమావేశంలో డీఆర్వో పి.వెంకటరమణ, సెక్షన్ సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నరసింహరావు, బి.శ్రీనివాసరావు, ఎస్‌వీవీ రామచంద్రరావు, కె.హరనాథ్‌బాబు పాల్గొన్నారు.

మూగ జీవుల వేదన

కంటైనర్‌లో 50 గోవులు.. పైకి కనిపించకుండా, అరుపులు వినిపించకుండా పైన టార్పాలిన్లు.. ఊపిరి ఆడకుండా వేదనతో మూగ జీవులు.. మూడు రోజుల క్రితం నక్కపల్లి సమీపంలో ఇలా గోవులను అక్రమంగా తరలిస్తున్న లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఆగకుండా వెళ్లిపోవడంతో పోలీసులు వెంబడించి తుని వద్ద పట్టుకున్నారు. దీంతో అక్కడ డ్రైవర్, క్లీనర్ లారీ వదిలి పరారయ్యారు. లారీలో ఏముందో పరిశీలిస్తే పైన టార్పాలిన్ కట్టేసి గుట్టుచప్పుడు కాకుండా 50 ఆవులను కబేళాకు తరలిస్తున్న విషయం బయటపడింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి గోవులను సింహాచలం గోశాలకు తరలించారు. ఇలా శ్రీకాకుళం జిల్లాలోని ఒడిశా సరిహద్దు మొదలుకొని వివిధ జిల్లాల నుంచి పలు రాష్ట్రాలకు పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నట్టు తెలుస్తోంది.

- యథేచ్ఛగా పశు రవాణా
- బ్రోకర్ల సాయంతో రాష్ట్రాలు దాటిస్తున్న వైనం
- కోట్లకు పడగలెత్తుతున్న దళారులు
- అధికారులకు నెలవారీ మామూళ్లు!



పైన టార్పాలిన్ కట్టి లారీలో పశువులను తరలిస్తూ మూడు రోజుల క్రితం తునిలో పట్టుబడ్డ వ్యాన్

నక్కపల్లి: మూగజీవులను దుర్మార్గంగా లారీల్లో కుక్కేసి.. అవి ఊపిరి ఆడకుండా విలవిల్లాడుతున్నా పట్టించుకోకుండా జిల్లాలు, రాష్ట్రాలు దాటించేస్తున్న అమానవీయ సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. పశువుల సంతల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలు చేసి బ్రోకర్ల సహాయంతో కేరళ, తమిళనాడు, హైదరాబాద్‌లలో ఉన్న కబేళాలకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. లారీలు, ఐషర్ వ్యాన్‌లు, పది టైర్ల ట్రాలీ లారీల్లో గుట్టుచప్పుడు కాకుండా వీటిని రవాణా చేస్తున్నారు. తగరపువలస, కొత్తవలస ప్రాంతాలకు చెందిన శేఖర్ అనే వ్యక్తి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి నిత్యం వందలాది పశువులను కేరళ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు తరలించే బాధ్యత తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యక్తి పశువులను రవాణా చేసే వాహనాలను మార్గంమధ్యలో అధికారులెవరూ అడ్డుకోకుండా ముందుగానే మామూళ్లు చెల్లిస్తున్నాడన్న ప్రచారం జరుగుతోంది. పశువులను రవాణా చేసే వాహనం ముందు ఒక జీపులో తన అనుచరులను పంపిస్తాడని, గమ్యం స్థానం చేరే వరకు ఎటువంటి అడ్డంకులు లేకుండా వారు చూసుకుంటారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన వాహనాలను ఎవరూ తనిఖీ చేయకుండా లక్షలాది రూపాయల నెలవారీ మామూళ్లు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. పశువుల రవాణా చేసేందుకు తనకు అధికారికంగా లైసెన్స్ కూడా ఉందని కూలీలను మభ్యపెడుతూ వారి సహాయంతో పశువులను కొనుగోలు చేసి రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారమంతా యథేచ్ఛగా జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఇచ్ఛాపురం, పార్వతీపురం, మానాపురం, అలమండ, చోడవరం, మాకవారిపాలెం, పిఎల్‌పురం, యలమంచిలి, నక్కపల్లి, పాడేరు, అరకు, ఎస్.రాయవరం, తాళ్లపాలెం, పాయకరావుపేటలతోపాటు తుని, పిఠాపురం తదితర ప్రాంతాల్లో జరిగే సంతల నుంచి కొనుగోలు చేసి తరలిస్తున్నట్టు తెలుస్తోంది.

బ్రోకర్లకు కాసుల పంట

ఒక ఐషర్ వ్యాన్ లేదా లారీ లోడు (20నుంచి 30 పశువులు) కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తే ఒక్కొక్క బ్రోకర్‌కు రూ.50 వేలు పైబడే కమీషన్ వస్తున్నట్టు తెలుస్తోంది ఇదిగాకుండా రవాణా ఖర్చుల నిమిత్తం కేటాయించే సొమ్ముల్లో మరో రూ.20 వేలు మిగులుతోంది. వారంలో ఒక దళారీ సగటున రూ.50 వేల నుంచి రూ.70 వేలు లబ్ధి పొందుతున్నాడు. ఇక లారీ పశువులను తమిళనాడుకు తరలించే కూలీలకు సైతం వారానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ముట్టచెబుతున్నారంటే ఈ వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతుందో అర్థమవుతోంది. లారీలు ఆపకుండా అధికారులను, పోలీసులను మేనేజ్ చేసేందుకు వారికి దళారులు ఒక్కొక్క లారీకి రూ.20 వేల నుంచి రూ.50 వేలు దారి ఖర్చుల కింద ముట్టచెబుతున్నట్లు తెలుస్తోంది. మైదాన ప్రాంతాలు, జాతీయరహదారి మీదుగా లారీల్లో పశువులను తరలిస్తే అడ్డగిస్తున్నారని గుర్తించిన దళారులు ఈ పశువుల వ్యాన్‌లు, లారీలను నర్సీపట్నం, పాడేరు, అరకు, మోతుగూడెం, చింతపల్లి, రంపచోడవరం తదితర ఏజెన్సీ ప్రాంతాలతో పాటు, సముద్రతీరం వెంబడి ఉన్న పాల్మన్‌పేట, ఉప్పాడ, పెరుమాళ్లపురం, అద్దరిపేట, కాకినాడ బీచ్ రోడ్డు మీదుగా తరలిస్తున్నారు. పశువుల అక్రమ రవాణా విషయమై నక్కపల్లి ఎస్ఐ శిరీషను వివరణ కోరగా గోవులను కబేళాకు తరలించడం చట్టరీత్యా పెద్ద నేరమన్నారు. హైవేపై గస్తీ నిర్వహిస్తున్న సమయంలో అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత గోవులను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలు, కంటైనర్లను పట్టుకుని కేసులు నమోదు చేసి గోవులను గోశాలకు తరలించడం జరిగిందన్నారు. అక్రమంగా పశు రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని, వెంటనే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామన్నారు.

క్లుప్తంగా

విప్ ధర్మశ్రీ ఆదేశాలతో నేల బావికి కంచె



నేలబావి చుట్టూ కంచె వేయిస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం శివారు నేతవానిపాలెంలో కప్పేసిన నేల బావి చుట్టూ అధికారులు కంచె ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన గొంపా వెంకటేశ్వరాజు కుటుంబ సభ్యులు తమ జిరాయితీ భూమిలో నేల బావిని కప్పేశారు. దీంతో పూర్వ కాలం నుంచి ఈ బావి నీటినే వినియోగించుకుంటున్నామని, పంచాయతీకి చెందిన బావిని తిరిగి తెరిపించాలని పలువురు గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో గురువారం సాయంత్రం బుచ్చెయ్యపేట పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరరావు, ఎస్ఐ కుమారస్వామి, అదనపు ఎస్ఐ నాయుడు పోలీస్ బందోబస్తు మధ్య నేలబావి చుట్టూ సిమెంట్ స్తంభాలు పాతి కంచె ఏర్పాటు చేసి రక్షణ కల్పించారు.

24న స్పాట్ అడ్మిషన్లు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్‌లో ఐవీసీలో లెటరల్/ఎంట్రీ ఇన్ డిప్లమో సెకండ్ ఈయర్–2023కు సంబంధించి ఈనెల 24న విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సివిల్‌లో 6, ఎలక్ట్రికల్‌లో 6, మెకానికల్‌లో 6 సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

విద్యార్థుల్లో సృజన వెలికితీసేలా బోధన



రేగుపాలెం పాఠశాలలో విద్యార్థుల పాఠ్యపుస్తకాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



రేగుపాలెం పాఠశాలలో భవనాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రవి పట్టాన్‌శెట్టి

- ఉత్తీర్ణత శాతాన్ని పెంపొందించాలి
- రేగుపాలెం, పులపర్తి పాఠశాలల్లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆకస్మిక తనిఖీ

యలమంచిలి: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా బోధన సామర్థ్యాలు పెంపొందించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. మండలంలోని రేగుపాలెం, పులపర్తి ఉన్నత పాఠశాలలను గురువారం ఉదయం ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రేగుపాలెం పాఠశాలలో విద్యార్థుల నోట్ పుస్తకాలను, వారి రాసిన పరీక్ష పత్రాలను పరిశీలించారు. విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. 3, 4, 5 తరగతులకు తెలుగు, గణితం (టెల్ల్), 6, 7, 8 తరగతులకు (లిప్) లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్‌పై నిర్వహించిన పరీక్షల్లో ఏ విద్యార్థి ఎన్ని మార్కులు సాధించాడని ఆరా తీశారు. వాటికి సంబంధించిన రికార్డులను ఉపాధ్యాయులను అడిగి తనిఖీ చేశారు. విద్యార్థిలో గ్రోత్‌ను బట్టి అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలన్నారు. ఇక్కడ నాడు -నేడు నిధులతో నిర్మిస్తున్న అదనపు గదులను మరుగుదొడ్లను కాంపౌండ్ వాల్ పనులను పరిశీలించారు. అనంతరం భవనాల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంఈవో, హెచ్ఎంలను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ చిన్నారులు ఎందుకు తక్కువగా ఉన్నారని ప్రశ్నించారు. వీరితోపాటు బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారా? బాలబాలికలకు ఏ విధంగా బోధన సాగిస్తున్నారని ఆరా తీశారు. ప్రణాళికాబద్ధంగా పిల్లలకు బోధన చేయాలని, కిశోర బాలల సర్వే ఏ విధంగా నిర్వర్తిస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. విద్యార్థులకు విటమిన్, నులిపురుగుల మాత్రలు పంపిణీ చేస్తున్నారా లేదా అని ఏఎన్ఎంను ప్రశ్నించారు. పులపర్తి పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టికను, వారి నోటు పుస్తకాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, ఎంఈవోలు మీనాక్షి, అరుణ్ కుమార్, ఏపీఎం రాణి, రేగుపాలెం, పులపర్తి పాఠశాల ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు నలుగురు ఎంపిక



జిల్లా స్థాయి పోటీల్లో చెస్ ఆడుతున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: జిల్లా స్థాయి చెస్ పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం ఎస్.రాయవరంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉత్కంఠ భరితంగా సాగాయి. ఇందులో అనకాపల్లి, అచ్యుతాపురం, యలమంచిలి, ఎస్.రాయవరం మండలాల విద్యార్థులు పోటీపడ్డారు. అనకాపల్లికి చెందిన కండలం తేజ విజేతగా నిలవగా, అచ్యుతాపురం మండలానికి చెందిన మిద్దె ధనుస్సు ద్వితీయ, ఎస్.రాయవరానికి చెందిన మళ్ల సూకరాజు తృతీయ, అనకాపల్లికి చెందిన విద్యార్థి వెంకట్ అనిష్ శ్రీవర్షన్ చతుర్థ స్థానాల్లో నిలిచారు. వీరు త్వరలో విజయనగరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని సంబంధిత అసోసియేషన్ కార్యదర్శి అమలకంటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు ఎంఈవో- 1 అప్పారావు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుక్కర్ పేలి అంగన్‌వాడీ ఆయాకు గాయాలు



గాయపడిన ఆయా పార్వతమ్మ

సాక్షి, పాడేరు : చింతలవీధి పంచాయతీ ఉబ్బేడిపుట్టు అంగన్‌వాడీ కేంద్రంలో వంటగదిలో గ్యాస్ స్టౌపై పప్పు ఉడకబెడుతున్న కుక్కర్ గిన్నె ఒక్కసారిగా పేలిన సంఘటన ఆందోళన కలిగించింది. కుక్కర్ పేలి ఆయా రేగం పార్వతమ్మ కాలిపై పడడంతో ఆమెకు తీవ్ర గాయమైంది. వరండాలో ఉన్న ఏడుగురు చిన్నారులకు, వారితో ఆటలు ఆడిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త కాసులమ్మకు త్రుటిలో అపాయం తప్పింది. కుక్కర్ పేలిన శబ్దానికి స్థానికులు అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకున్నారు. గాయాలపాలైన ఆయా పార్వతమ్మను 108లో హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు కల్పించారు. కాలికి తీవ్ర గాయమవ్వడంతో శస్త్రచికిత్సకు వైద్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ. పక్కన డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన కోలా గురువులు

చోడవరం: వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే ధ్యేయంగా కార్యకర్తలంతా పనిచేయాలని ప్రభుత్వం విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. చోడవరం పట్టణంతోపాటు మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశాన్ని మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు అధ్యక్షతన గురువారం అంబేరుపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ చోడవరం మండలంలో 77 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, వాటికి అందరి ఆమోదంతో బూత్ కమిటీలను నియమించామన్నారు. బూత్ కమిటీల సభ్యులు గ్రామ/వార్డు పరిధిలో నాయకులను, కార్యకర్తలను కలుపుకుని పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. 2024లో మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రానుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధితో ప్రజలంతా మద్దతు పలుకుతున్నారని తెలిపారు. వారికి మరింత సేవలందిస్తూ మమేకం కావాలన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన కోలా గురువులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా కార్యకర్తలు తీసుకెళ్లాలన్నారు. అంతా సమష్టిగా పనిచేసి వర్గ విభేదాలు లేకుండా ఉండాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అంతా పని చేయాలని కోరారు. అనంతరం డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన కోలా గురువులను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు నాగులాపల్లి రాంబాబు, డీసీసీబీ డైరెక్టర్ మూడెడ్ల శంకరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి రాంబాబు, ఎంపీటీసీల మాజీ ఫ్లోర్ లీడర్ సూరిశెట్టి నాగదుర్గ గోవింద, డీఆర్‌యూసీ సభ్యుడు బొడ్డు శ్రీరామ్మూర్తి, సర్పంచ్ కార్లె ఈశ్వరమ్మ, జిల్లా ప్రతినిధి పల్లా నర్సింగరావు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, మండల ఏసీఎస్ కన్వీనర్ పతివాడ అప్పారావు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

అనకాపల్లిటౌన్ : స్థానిక రైల్వేస్టేషన్ మూడో నంబర్ ప్లాట్‌ఫారం సమీపంలో రైల్వే ట్రాక్‌పై గురువారం సుమారు 25–30 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ డి.రాజు కథనం మేరకు వివరాలివి. నీలి రంగు జీన్ ప్యాంట్, లైట్ ప్యారెట్ కలర్ చొక్కా ధరించిన గుర్తు తెలియని యువకుడు గురువారం తుని నుంచి విశాఖ వెళుతున్న సూపర్‌ఫాస్టు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ చెప్పారు. వివరాలకు 8688679721 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.



రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్న గుర్తుతెలియని యువకుడు

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- పెదపల్లి డ్వాక్రా మహిళలకు ఏయూ ప్రొఫెసర్లు శివరామకృష్ణ, బాబావలీ అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏయూ ప్రొఫెసర్లు

యలమంచిలి: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ బి.శివరామకృష్ణ, డాక్టర్ ఎస్.బాబావలీ తెలిపారు. గురువారం యలమంచిలి మున్సిపాలిటీ పెదపల్లి గ్రామంలో డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న రాయితీ రుణాలు ఏవిధంగా వినియోగించుకోవాలి, వాటిని వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టి లాభాలు ఎలా ఆర్జించాలి, తదితర సూచనలు, సలహాలు అందజేశారు. వ్యవసాయ, పాడి పరిశ్రమ, హోమ్ సైన్స్, న్యూట్రిషియన్ ఫుడ్ వంటి కుటీర పరిశ్రమలపై శ్రద్ధ వహించి, వాటి ద్వారా ఎక్కువ లాభాలు సాధించవచ్చునని ఈ సందర్భంగా ఏయూ ప్రొఫెసర్లు వివరించారు. కార్యక్రమంలో మెప్మా అధికారి వరలక్ష్మి, సీఎంఎం పద్మావతి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్లు దాసరి కుమార్, దుంగా అచ్యుతరావు, మాజీ సర్పంచ్ కొడిగుడ్డు రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైందని ఆటో డ్రైవర్ ఆత్మహత్య

అనకాపల్లి టౌన్: ప్రేమ విఫలమైందని మనస్థాపంతో గాంధీనగరానికి చెందిన కె.కుమార్(33) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు సీఐ దాడి మోహన్‌రావు తెలిపారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే కుమార్ గురువారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి తండ్రి కె.తాడయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించామని సీఐ తెలిపారు.

తల్లిదండ్రులను భయపెడదామని మాత్రలు మింగి...



మృత్యువాత పడిన కిరణ్

ఎస్.రాయవరం : అనారోగ్యానికి వాడే మందులు అధికంగా మింగి ఓ యువకుడు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఎస్ఐ ప్రసాద్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.రాయవరం గ్రామానికి చెందిన లక్కోజు కిరణ్ (18) ఐటీఐ చదువుతున్నాడు. బుద్ధిగా చదువుకోకుండా చిల్లరగా తిరుగుతున్నావని తల్లిదండ్రులు మందలించడంతో చనిపోతానంటూ వారిని బెదిరించడానికి రెండు రోజుల క్రితం ఇంటి వద్ద ఫిట్స్ నయం కోసం వాడే మాత్రలు అధికంగా మింగాడు. దీంతో అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు గమనించి అతనిని యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ కోలుకోకపోవడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కిరణ్ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చర్చనీయాంశంగా ఒడిశా బోర్డుల ఏర్పాటు



జోలాపుట్టులో ఆంధ్ర ప్రాంతంలో ఒడిశా అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలోని ఆంధ్ర భూభాగంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన స్వాగతం తెలిపే బోర్డులు ఏర్పాటు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆంధ్ర భూ భాగంలోని ఎల్ఎఫ్ ప్రదేశంలో ఒడిశా అధికారులు ఒడిశాలోని బిల్లాపుట్టు గ్రామ పంచాయితీకి స్వాగతం పలికే బోర్డులు ఏర్పాటు చేశారు. ఇలా ఏర్పాటుచేయడం నిబంధనలకు విరుద్ధమని జోలాపుట్టు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

శభాష్.. వలంటీర్

- డోలీలో గర్భిణి తరలింపు
- పది కిలోమీటర్లు మోసిన దేముడు



గర్భిణిని డోలీలో మోసుకు వస్తున్న గ్రామ వలంటీర్ దేముడు (వెనుక వ్యక్తి)

అనంతగిరి : పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని తరలించడంలో వలంటీర్ బాసటగా నిలిచాడు. ఆమె భర్తతోపాటు అతను కూడా డోలీ మోసి ప్రాణాపాయం నుంచి కాపాడాడు. వివరాలిలాఉన్నాయి. మండలంలోని గుమ్మ పంచాయతీ కర్రిగుడకు చెందిన గర్భిణీ బడ్నాయిన బుగ్గమ్మ (19)కు గురువారం పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వాహనం వచ్చే పరిస్థితి లేదు. దీంతో గర్భిణి భర్త శ్రీను, గ్రామ వలంటీర్ బడ్నాయిన దేముడు ఆమెను డోలీలో దట్టమైన అటవీ ప్రాంతం గుండా సుమారు పది కిలోమీటర్ల మేర మోసుకుంటూ నిమ్మతోట తీసుకువచ్చారు. అక్క డి నుంచి ఆటోలో గర్భిణిని కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. గర్భిణిని తరలించడంలో కీలకపాత్ర పోషించిన వలంటీర్ దేముడును పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



సునీల్ (ఫైల్)



నాని (ఫైల్)



ప్రమాదం జరిగిన ప్రాంతం

గంగవరం : నెల్లిపూడి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారని ఎస్ఐ చినబాబు విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లిపూడి నుంచి కొత్తపల్లి వైపు ద్విచక్రవాహనంతో వెళ్తున్న యువకులు, అడ్డతీగల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో నెల్లిపూడి గ్రామానికి చెందిన సబ్బవరపు సునీల్ (23) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన చెక్కా నానిబాబు (22)ను 108 అంబులెన్స్‌లో గోకవరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఇద్దరు యువకుల మృతితో నెల్లిపూడి కాలనీలో రెండు కుటుంబాలు శోకంలో మునిగిపోయాయి. ఈ ప్రమాదం కారణంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

ఇండియన్ బ్యాంక్ / इंडियन बैंक

సీతమ్మధార బ్రాంచ్
డోర్ నెం.50-96-8/5, మొదటి అంతస్తు, ప్లాట్ నెం.ఎమ్ఐజి-23, సీతమ్మధార, ఎన్ఐ లే అవుట్, విశాఖపట్నం - 530013. ఫోన్. 0891-2723300

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన

"APPENDIX- IV-A" (రూలు 8(6)కు నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

ఈ విధంగా సాధారణంగా ప్రజలకు మరియు ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు నోటీసులు ఇవ్వడమైనది. క్రింద వివరించిన స్థిరాస్తి సెక్యూర్డు క్రెడిటార్, తనఖా పెట్టిన వీటిని ఇండియన్ బ్యాంక్, సీతమ్మధార శాఖ, విశాఖపట్నం యొక్క అధీకృత అధికారి సాంకేతికంగా స్వాధీనతలోనికి తీసుకున్నారు. అమ్మకం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిపై ది.23-08-2023న అమ్మబడుతుంది. ఇండియన్ బ్యాంక్, సీతమ్మధార శాఖ, విశాఖపట్నంకు బకాయి మొత్తం ది.30-06-2023 నాటికి రూ.12,64,069/- (అక్షరాల పన్నెండు లక్షల అరవై నాలుగు వేల అరవై తొమ్మిది రూపాయలు మాత్రము) తేది.01.07.2023 నుండి తదుపరి జమకూరు వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు మొ॥నవి. మెస్సర్స్ వెల్త్ కన్‌స్ట్రక్షన్స్, ఋణగ్రహీతల నివాస చిరునామా : 1. శ్రీ గాదిరాజు శ్రీనివాసరాజు (మేనేజింగ్ పార్ట్‌నర్), తండ్రి: రామభద్ర రాజు, డి.నెం.51-8-43/44, ఫ్లాట్ నెం.101, సీతా ఎన్‌క్లేవ్, సీతమ్మధార, ఈనాడు ప్రక్కన, పి & టి కాలనీ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530013. 2. శ్రీ గాదిరాజు లక్ష్మీకళ (పార్ట్‌నర్), భర్త : గాదిరాజు శ్రీనివాసరాజు, డి.నెం.51-8-43/44, ఫ్లాట్ నెం.101, సీతా ఎన్‌క్లేవ్, సీతమ్మధార, ఈనాడు ప్రక్కన, పి & టి కాలనీ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530013. 3. శ్రీ దండు రవి కుమార్ రాజు (పార్ట్‌నర్), తండ్రి : వెంకట సూర్య కేశవ భగవాన్ రాజు, ఎ-301, శివాజీ నగర్, ప్యాలెస్ హైట్స్, కూర్మన్నపాలెం, అగనంపూడి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530046.

ఇ-వేలం ద్వారా అమ్మకానికి ప్రతిపాదించబడిన ఆస్తుల యొక్క నిర్దిష్ట వివరములు దిగువన పేర్కొనబడినవి

ఆస్తి యొక్క పూర్తి వివరణ :	రిజర్వు ధర	ధరావత్తు	ఈ - వేలము తేది మరియు సమయం	ఆస్తిపై ఎన్‌కంబ్రెన్స్
గాదిరాజు శ్రీనివాసరాజు గారి పేరున గల ఆస్తి : విశాఖపట్నం జిల్లా, యలమంచిలి ఎస్ఆర్ఓ, అచ్యుతాపురం మండలం, ముదుతూరు గ్రామం మరియు పంచాయితీ వద్ద డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ ద్వారా ఆమోదం పొందిన ఎల్.పి.నెం.9/2006/VSp, ప్లాట్ నెం.11 యొక్క సర్వే నెం.208 మరియు 209/1 లోని 365.55 చ॥గ॥లు లేదా 304.80 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు: 33 అ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం: 60 అ॥ల గోర్జా, పడమర: ప్లాట్ నెం.8, ఉత్తరం: ప్లాట్ నెం.10, కొలతలు: తూర్పు: 48.00 అ॥లు లేదా 14.63 మీ॥లు, దక్షిణం: 64.00 అ॥లు లేదా 19.50 మీ॥లు, పడమర: 48.50 అ॥లు లేదా 14.78 మీ॥లు, ఉత్తరం: 72.00 అ॥లు లేదా 21.94 మీ॥లు. ఆస్తి ఐడి నెం.: IDIB3147323354-01	రూ. 16,40,000/- (అక్షరాల పదహారు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే)	రూ. 1,65,000/- (అక్షరాల ఒక లక్షా అరవై ఐదు వేల రూపాయలు మాత్రమే)	23-08-2023 సమయం : ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు (బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్ల డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ అవసరం లేదు) బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/- (అక్షరాల పదివేల రూపాయలు)	లేదు
గాదిరాజు లక్ష్మీకళ గారి పేరున గల ఆస్తి : విశాఖపట్నం జిల్లా, యలమంచిలి ఎస్ఆర్ఓ, అచ్యుతాపురం మండలం, ముదుతూరు గ్రామం మరియు పంచాయితీ వద్ద డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ ద్వారా ఆమోదం పొందిన ఎల్.పి.నెం.9/2006/VSp, ప్లాట్ నెం.19 యొక్క సర్వే నెం.208 మరియు 209/1 లోని 266.66 చ॥గ॥లు లేదా 222.962 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు: 33 అ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.20, పడమర: ప్లాట్ నెం.25, ఉత్తరం: ప్లాట్ నెం.18. కొలతలు : తూర్పు: 40.00 అ॥లు లేదా 12.19 మీ॥లు, దక్షిణం: 60.00 అ॥లు లేదా 18.29 మీ॥లు, పడమర: 40.00 అ॥లు లేదా 12.19 మీ॥లు, ఉత్తరం: 60.00 అ॥లు లేదా 18.29 మీ॥లు. ఆస్తి ఐడి నెం.: IDIB3147323354-02	రూ. 12,00,000/- (అక్షరాల పన్నెండు లక్షల రూపాయలు మాత్రమే)	రూ. 1,20,000/- (అక్షరాల ఒక లక్షా ఇరవై వేల రూపాయలు మాత్రమే)		

ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి మొత్తాన్ని చెల్లించడానికి చివరి తేది మరియు సమయం : ది.22.08.2023 & సాయంత్రం గం.5 :00 ని॥లకు

వేలం బిడ్ ఫారం మరియు నియమనిబంధన వివరములను మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ MSTC LTD. వారి వెబ్‌సైట్ (www.mstcecommerce.com/auction/home/ibapi) నందు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనుటకు చూడవలసినదిగా బిడ్డర్లకు సలహానీయటమైనది. ఇ-వేలం పూర్తి విధానం సాంకేతిక సహాయం కొరకు MSTC హెల్ప్‌డెస్క్ నెం. 033-23400020/23400021/23400022 మరియు సర్వీసు ప్రొవైడర్‌లో లభించు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్‌లను సంప్రదించండి. MSTC LTD. రిజిస్ట్రేషన్ స్టేటస్ కోసం దయచేసి ibapiop@mstcecommerce.com మరియు ధరావత్తు స్టేటస్ కోసం దయచేసి ibapifin@mstcecommerce.com సంప్రదించవచ్చును. ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫోటోగ్రాఫ్ మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://ibapi.inను సంప్రదించండి. మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరణలకోసం హెల్ప్‌లైన్ నెంబర్ '18001025026' మరియు '011-41106131' నందు సంప్రదించండి. https://ibapi.in మరియు www.mstcecommerce.comలో వెబ్‌సైట్‌లోని ఆస్తికోసం చూస్తున్నప్పుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్డర్లు చూడగలరు.

ప్రదేశం : విశాఖపట్నం
తేది : 18-07-2023

సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

క్లుప్తంగా

కశింకోటలో 'జగనన్న సురక్ష' నేడు

కశింకోట: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు 2, 4 సచివాలయాలకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమం జరగనున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ గురువారం తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్ రాజు, ప్రత్యేక అధికారి రోజారాణి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సచివాలయాల పరిధిలో వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి, ఆయా పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గృహసారథులు, వలంటీర్లు, స్థానిక పార్టీ నాయకులు, దరఖాస్తుదారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీపీ తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల సచివాలయం-1 పరిధి అంగన్‌వాడీ సెంటర్-5ను ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం తనిఖీ చేశారు. కేంద్రంలో మెనూ సక్రమంగా అమలుచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించి, సక్రమంగా లేకపోవడంతో మండిపడ్డారు. తక్షణమే సదరు కేంద్రం నిర్వాహకురాలిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శశికళ, సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు విల్లూరి చంద్రశేఖర్, తర్రా సత్యారావు, సిగిరిశెట్టి కష్ణ మోహన్, సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



పనులను పరిశీలిస్తున్న మళ్ల బుల్లిబాబు

కశింకోట: స్థానిక గుర్రం జాషువా కాలనీ మీదుగా హౌసింగ్ కాలనీకి జాతీయ రహదారి నుంచి సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో గ్రామాభివృద్ధిలో భాగంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. పనులను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం భూమి చదును పనులు జరుగుతున్నాయని, త్వరలోనే సిమెంట్ రోడ్డు వేస్తామన్నారు. నిధులు మంజూరు చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్‌ఏల రిలే దీక్షలు

కశింకోట: స్థానిక ఆటో స్టాండ్ వద్ద వీఆర్‌ఏలు తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. తమను పర్మినెంట్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని, నూతన నియామకాల్లో నిబంధనలు పాటించాలని, అర్హులకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలోని వీఆర్‌ఏలు రిలే దీక్షలో పాల్గొన్నారు.

రైతు 'మిత్రులు'

చీమ, పాము, వానపాము, సాలెపురుగు, ట్రైకోగ్రామా.. ఇవన్నీ సేద్యంలో రైతులకు ఎంతగానో సాయపడే వ్యవసాయ మిత్రులు. వానపాము తన విసర్జకాలతో భూమిని సారవంతం చేయడంతోపాటు.. నేలను గుల్లబారేలా చేస్తుంది. అయితే సేద్యంలో చీడపీడల నివారణకు రైతులు వాడే రసాయనాలతో వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రకృతి సిద్ధంగా తెగుళ్లను అరికట్టే మిత్రపురుగుల్ని నాశనం చేసే రసాయన వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

- పెరిగిన పురుగు మందుల వినియోగం
- అంతరించిపోతున్న మిత్ర పురుగులు
- ప్రకృతి వ్యవసాయ సాగుతో మేలు- వ్యవసాయశాఖ



వరి నారు మడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



పురుగు మందు పిచికారి చేస్తున్న రైతు (ఫైల్)

అనకాపల్లి రూరల్ : వ్యవసాయ దిగుబడులకు గొడ్డలిపెట్టులా మారే చీడ పీడలను నివారించి, రైతులకు మేలుచేసే మిత్ర పురుగులు క్రమంగా క్షీణిస్తున్నాయి. పంటలకు నష్టం వాటిల్లజేసే పురుగులను ప్రత్యక్షంగా నివారించడం ఎంత ముఖ్యమో పరోక్షంగా పంటలను కాపాడే మిత్ర పురుగులను రక్షించుకోవడం కూడా అంతే ముఖ్యం. అసంబద్ధ క్రిమి సంహారక మందుల వాడకంతో శత్రు పురుగులతో పాటు మిత్ర పురుగుల జాడ లేకుండా పోతోందని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెగుళ్లపై కంగారొద్దు

అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో కశింకోట, మునగపాక, అనకాపల్లి మండలాల్లో సుమారు 20 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఖరీఫ్ సాగుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కొన్ని చోట్ల నారు మడులు కూడా వేశారు. మరి కొన్ని చోట్ల వెద పద్ధతిలో సాగు జరుగుతోంది. ఇంకొన్ని చోట్ల దుక్కి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో చాలా చోట్ల నారు మడులు ఏపుగా పెరుగుతున్నాయి. దుక్కిలో వేసే కలుపు నివారణ రసాయనాలతో పంటకు మేలు చేసే మిత్ర పురుగులు కూడా నాశనమయ్యే ప్రమాదం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

మేలు చేకూర్చే సాలీడు, తూనీగ

పచ్చ పురుగు, లద్దె పురుగులు పైరుపై పెట్టిన గుడ్ల నుంచి బయటకు వచ్చే సంతతిని సాలీడు పురుగు ఎప్పటికప్పుడు తినేస్తుంది. ఈ పురుగుల సంతతి పెరగకుండా నివారిస్తుంది. మరో మిత్ర పురుగైన తూనీగలు చీడ పురుగులు పంటలపై పెట్టిన గుడ్లను తినడమే కాకుండా పైరులో పరపరాగ సంపర్కం జరగటానికి ఎంతగానో దోహద పడతాయి. పంటలో మంచి దిగుబడులకు తమ వంతు సాయం చేస్తాయి.

మరికొన్ని మిత్ర పురుగులు

కందిరీగ, మిడత, పాడిసన్‌బగ్ వంటి మిత్ర పురుగులు సైతం పంటను ఆశించే చీడ పురుగులు, పంటపై పెట్టిన గుడ్లను ఎప్పటికప్పుడు తినేస్తూ వాటి సంతతి పెరగకుండా నివారిస్తాయి. ఇలా రైతుకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పంటను ఆశించే చీడ పురుగులను నివారించడంలో రైతుకు ఎంతో సాయం చేస్తున్న మిత్ర పురుగులు, రైతుల నిర్లక్ష్యం, అవగాహనలేమి కారణంగా నశించి పోతున్నాయి. ముఖ్యంగా పలు రకాల క్రిమి సంహారక మందులు అతిగా పిచికారీ చేయడం వలన పంట మిత్ర పురుగులు వేగంగా నశించి పోతున్నాయని వ్యవసాయశాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలతో మేలు



పంటలకు క్రిమి సంహారక మందులు అవసరం మేరకే వినియోగించాలి. కానీ కొందరు రైతులు మోతాదుకు మించి పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల మిత్ర పురుగులు క్రమంగా అంతరించి పోతున్నాయి. పంట పెరుగుతున్న కొద్దీ చీడ, పీడల బెడద కనిపిస్తుంది. అంత మాత్రాన వెంటనే రసాయనాల జోలికి వెళ్లరాదు. పర్యావరణం ద్వారా లేదా మిత్ర పురుగుల ద్వారా అవి చాలా వరకు నశిస్తాయి. ప్రస్తుత పరిస్థితులలో రైతులు క్రమేపీ క్రిమి సంహారక మందులకు స్వస్తిపలికి ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా పంట మిత్ర పురుగులను కాపాడుకోవచ్చు.

– పీయూటీపీ రంగాచారి, వ్యవసాయాధికారి

సర్వతోముఖాభివృద్ధి దిశగా కశింకోట

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు



కశింకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూలేని విధంగా గ్రామ పంచాయతీ పరిధిలో గణనీయ అభివృద్ధి జరుగుతోందని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో కశింకోటలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన నిధులు సుమారు రూ.9 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. గ్రామంలోని పలు వీధుల్లో అంతర్గత సిమెంట్ రోడ్లు, 5 కి.మీ. మేర డ్రైనేజీలు, నాలుగు సచివాలయ భవనాల నిర్మాణం పూర్తయిందన్నారు. మరో రూ.కోటిన్నరతో మిగిలిన రోడ్లు, కాలువలను జనవరిలోగా నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీంతో కశింకోట గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెంది, ఆదర్శంగా నిలుస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. సీఎం జగన్ ప్రభుత్వంలో సుమారు 1350 మందికి జగనన్న ఇళ్లు కేటాయించామన్నారు. ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో వీరికి స్థలాల కోసం రూ.8 కోట్లతో గ్రామాన్ని ఆనుకుని ఉన్న ప్రైవేటు భూములు కొనుగోలు చేసి ఇచ్చామన్నారు. సొంత స్థలాలు ఉన్న మరో 600 మంది లబ్ధిదారులకు, గతంలో దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో ఇచ్చిన 135 ఇళ్లను కోర్టు కేసుల నుంచి విముక్తి కలిగించి, వారికి అప్పగించినట్టు పేర్కొన్నారు. రైతులకు ఉపయోగపడేలా గవరపేటలో శారదానదిపై రూ.3 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణం కరోనా మహమ్మారి వల్ల కొన్నాళ్లు, నదిలో నీరు చేరడం తదితర కారణాల వల్ల అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. వచ్చే జనవరి నుంచి దీని నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఇందుకు ఎంపీ బీవీ సత్యవతి సహకారం కోరినట్టు పేర్కొన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధి, రూ.60 లక్షలతో కనకమహాలక్ష్మి ఆలయం నుంచి జాతీయ రహదారికి తారు రోడ్డు నిర్మిస్తున్నట్టు తెలిపారు. అరబిందో పరిశ్రమ సహకారంతో సుమారు రూ.కోటి వెచ్చించి పంచాయతీ వద్ద కల్యాణ మండపం నిర్మిస్తున్నామన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన దీక్షలు



నినాదాలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అనకాపల్లి రూరల్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం అనకాపల్లి జోన్ పరిధిలోని మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు నిరసన దీక్షలు చేపట్టారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ 2వ సర్కిల్ వద్ద జరిగిన నిరసన శిబిరంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ మున్సిపల్ ఆప్కాస్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, సత్యనారాయణ, అజయ్, మున్సిపల్ కార్మికుల సంఘం నేతలు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు వీఆర్‌ఏల ధర్నా



ధర్నాలో పాల్గొన్న వీఆర్‌ఏలు

అనకాపల్లి రూరల్: కనీస వేతనం రూ.26 వేలు చెల్లింపు, పే స్కేల్ వర్తింపు, పదోన్నతులు తదితర డిమాండ్లతో సీఐటీయూ ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.శ్రీరామమూర్తి, నాయకులు గంటా శ్రీరామ్, తోటాడ సింహాచలం, కొత్తపల్లి నాగేశ్వరరావు, ఎస్‌కేఆర్ బాషా, జి.సూర్యారావు, జి.రాధిక, ఎస్.పద్మ పాల్గొన్నారు.

బదిలీ అయిన హెచ్‌ఎంకు సత్కారం



హెచ్‌ఎంను సత్కరిస్తున్న స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ పట్నాయక్‌ను గురువారం ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ కన్వీనర్ ఎరుబండి సత్యనారాయణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీఎం నాయుడు మాట్లాడుతూ హెచ్‌ఎంగా సుదర్శన్ పట్నాయక్ చేసిన సేవలను ప్రశంసించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శంకరరావు మాట్లాడుతూ తక్కువ సమయంలో పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో యూత్ లీడర్ జగదీష్, పాఠశాల చైర్మన్ సంధ్య, వైస్ చైర్మన్ రవీంద్ర, డాక్టర్ నరేంద్రకుమార్, హెచ్‌ఎం శాస్త్రి, జోగాంబకామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో అపార అవకాశాలు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తుమ్మపాల: సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు వివిధ రకాల నిర్మాణ సామగ్రి నాణ్యతా పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని బీవోఎంఎస్(బొమ్స్) ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణంలోని డైట్ కళాశాలలో గురువారం డైట్ ఐఈ(ఐ)చాప్టర్ విద్యార్థుల ఆధ్వర్యంలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మోడరన్ కన్‌స్ట్రక్షన్స్ మెటీరియల్స్‌పై అతిథి ఉపన్యాసం ఇచ్చారు. సివిల్ ఇంజినీరింగ్ రంగంలో విద్యార్థులు ఉపాధి అవకాశాలు పెంచుకోవడం ద్వారా మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ప్రాక్టికల్ పరిజ్ఞానం చాలా అవసరమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ గెస్ట్ లెక్చర్స్ ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎన్.రాము మాట్లాడుతూ డైట్‌లో ప్రపంచ స్థాయి విధానాలను అవలంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్ చాప్టర్ కన్వీనర్ హేమంత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు

కశింకోట: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకుంటే ఉజ్వల భవిష్యత్ సాకారమవుతుందని ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి సూచించారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థుల కెప్టెన్, వైస్ కెప్టెన్ల నియామకం గురువారం జరిగింది. చెరో నలుగురిని ఎంపిక చేశారు. అనంతరం కవాతు నిర్వహించి గౌరవ వందనం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన అలవరచుకోవాలన్నారు. సానుకూల దృక్పథంతో ఎంతటి విజయాలనైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్, కరస్పాండెంట్ అనూరాధ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

పరవాడ: పరవాడ 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చేపట్టనున్న జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఏఈ ఎస్.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, దలాయిపాలెం, దోసూరు, సునపర్తి లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మోదీ పాలనలో సంక్షేమం



కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

తుమ్మపాల: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేఏళ్ల పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించారని బీజేపీ మండలాధ్యక్షుడు కపిల తాతారావు అన్నారు. మండలంలోని మాకవరం, మామిడిపాలెం గ్రామాల్లో గురువారం గృహసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన, రైతులకు యంత్రాలు, రుణాలు తదితర సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, వుడా రమేష్, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

సీతారామ ఆలయానికి లాకర్ వితరణ



లక్ష్మీదేవిపేట సీతారామ ఆలయానికి లాకర్‌ను అందిస్తున్న కొణతాల రేవతీరావు

తుమ్మపాల: పట్టణంలో లక్ష్మీదేవిపేట శ్రీసీతారామ ఆలయానికి స్థానిక భక్తుడు కొణతాల రేవతీరావు లాకర్‌ను గురువారం బహూకరించారు. ఆలయ అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఆలయ అధ్యక్షుడు పాలమరిశెట్టి వరాహసత్యనారాయణ మాట్లాడుతూ అబ్కారీ అధికారిగా రేవతీరావు తండ్రి కొణతాల రమణ 1996లో ఆలయానికి మూల విరాట్ విగ్రహాలను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి కొణతాల సాయిరాం, మాస్టర్ కొణతాల నాయుడు, ఆడారి బాబ్జి, రాపేటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మరింత సంక్షేమం

- ధ్రువపత్రాల పంపిణీలో వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణుమూర్తి



ధ్రువపత్రాల పంపిణీలో డాక్టర్ విష్ణుమూర్తి, మురళీకృష్ణ, రమేష్, జెడ్సీ వెంకటరమణ

తుమ్మపాల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత సంక్షేమం అందించాలనే ఉద్దేశంతోనే అందుకు అవసరమైన వివిధ రకాల ధ్రువపత్రాలను వలంటీర్ల సహకారంతో సచివాలయాల ద్వారా అందిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణుమూర్తి తెలిపారు. పట్టణంలోని 13, 14 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని 14 సచివాలయంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైౖ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్‌తో కలిసి దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను శతశాతం అమలుచేస్తున్న ఖ్యాతి సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వివిధ సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు నోచుకోని వారికి కూడా సంక్షేమ లబ్ధి అందించాలనే జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ప్రజల వద్దకే అధికార యంత్రాంగ మొత్తం వచ్చి సేవలు అందించడం ఊహించని అద్భుతమన్నారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ మాట్లాడుతూ అన్ని రకాల సేవలు కలిపి ఈ ఒక్క రోజే 720 ధ్రువపత్రాలను అందించినట్టు తెలిపారు. జాజుల రమేష్ మాట్లాడుతూ 28 రకాల పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు.

వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజుల పర్యవేక్షణలో ఈ ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనకాపల్లి అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్రీరామమూర్తి, ఆర్‌వో సురేష్, ఎంపీడీవో దొర, ఆర్‌ఐ మణ్ర్రా శేఖర్, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కడిమిశెట్టి సతీష్, పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు దాడి భోగలింగం, గొన్నాబత్తుల రమణ, మహాత్మా సంతోష్, కల్కి శ్రీను, శ్రీధరాల మనోజ్, సచివాలయాల కన్వీనర్లు, సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి పండగ

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అచ్యుతాపురం, ఎం.జగన్నాథపురం గ్రామాలు గురువారం పండగలతో సందడిగా మారాయి. అచ్యుతాపుంలో మరిడిమాంబ పండగను పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

లేగ దూడల పెంపకానికి తోడ్పాటు

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ప్రసాద్‌బాబు

అచ్యుతాపురం (అనకాపల్లి) : నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులు అని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.ప్రసాద్‌బాబు అన్నారు. రావిపాలెంలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాడి రైతులు లేగ దూడల పెంపకం ద్వారా పశుగణాభివృద్ధికి కృషి చేయాలన్నారు. లేగ దూడల ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచిన దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎఫ్ కేటగిరిలో మొదటి బహుమతి మచ్చు నాయుడు, రెండో బహుమతి గొర్లె రమణబాబుకు, మూడో బహుమతి కె.వెంకటరావుకు, ప్రోత్సాహక బహుమతి కె.అప్పారావుకి లభించాయి. సర్పంచ్ నర్మాల సుబాత, పశుసంవర్ధక శాఖ డీడీ కరుణాకర్, సహాయ సంచాలకుడు సునీల్ కుమార్, దోసూరు వైద్యాధికారి వాత్సవి, అమూల్ నోడల్ ఆఫీసర్ భానుబాబు, డీఎల్‌డీఏ డాక్టర్ సంధ్య, దుప్పుతూరు రామారావు, కె.సుబ్రమణ్యం, జగదీష్ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం అందుకున్న హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి దంపతులు, చిత్రంలో ఉపాధ్యాయులు

కశింకోట: స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి, ఇటీవల బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడుతో సహా నలుగురు ఉపాధ్యాయులను గురువారం సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. హెచ్‌ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు దేవానంద్, సుబ్బరాజు, మోహనరావులు ఇటీవల బదిలీ అయ్యారు. దీంతో వీరిని దుశ్శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందించి సత్కరించారు. హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు వారి సేవలను ప్రశంసించారు. ఉపాధ్యాయులు ప్రభాకర్, జయరాంప్రసాద్, నాగేశ్వరరావు, శర్మ, అప్పారావు, రామారావు, పీడీ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
హిడింబ	: సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-2
హత్య	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
కార్తీక	: వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫోటో స్టూడియో	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 90 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-39 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-26 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-9 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 394మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై కండక్టర్ మార్చనున్న కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో నరసింగబిల్లి, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, జి.భీమవరం, అడ్డాం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లోని వ్యవసాయ, గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

మృతుని కుటుంబానికి రూ. 23 లక్షల పరిహారం

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీ స్మైలెక్స్ పరిశ్రమలో బుధవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామానికి చెందిన నాగులాపల్లి నాగేశ్వరరావు (24) కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యం నష్టపరిహారంగా రూ. 23 లక్షలు చెల్లించడానికి అంగీకారం తెలిపిందని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ చెప్పారు. బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం కుదిరిందని చెప్పారు. దహన సంస్కార ఖర్చుల నిమిత్తం మరో రూ.50 వేలు అదనంగా చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. చర్చల్లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్రావు, ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరి వెంకటరమణ పాల్గొన్నారు. చర్చలు ఫలించడంతో బుధవారం అర్ధరాత్రి తర్వాత మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.